క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం


పిల్లి సూర్యప్రకాశ్

రామచంద్రపురం రూరల్: నేటి సాయంత్రం 4 గంటలకు వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ శనివారం విలేకరులకు తెలిపారు. రామచంద్రపురం పట్టణం, రామచంద్రపురం రూరల్ గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా కోరారు.

మాదకద్రవ్యాలను యువత ప్రతిఘటించాలి


గొల్లపాలెంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఎస్సై చిట్టిబాబు, సిబ్బంది

కాజులూరు: మాదకద్రవ్యాలను యువత ప్రతిఘటించాలని ఎస్‌ఈబీ ఎస్సై టి.చిట్టిబాబు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం గొల్లపాలెం కాకతీయ జూనియర్ కళాశాలలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) సిబ్బంది మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై టి.చిట్టిబాబు మాట్లాడుతూ మనిషి మాదకద్రవ్యాలకు బానిస అయితే జీవితాన్నే నాశనం చేసుకున్నవాడవుతాడన్నారు. యువత మాదకద్రవ్యాలను ప్రతిఘటిస్తూ వాటి ప్రభావానికి సమాజంలో ఎవరూ బలికాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వార్షికోత్సవ పూజలు

కపిలేశ్వరపురం: మండల పరిధిలోని వల్లూరులో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, అయ్యప్పస్వామి, షిర్డీ సాయిబాబా దేవాలయాల సముదాయంలో నిర్వహిస్తున్న 13వ వార్షికోత్సవ పూజలు శనివారంతో ముగిశాయి. ఆలయాల ప్రాంగణంలో వేద పండితులచే విష్ణు సహస్రనామ పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర, టేకి గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామికి అర్చక బృందం సభ్యులు పంచామృతాభిషేకం చేశారు. అంగరతో పాటు పడమర ఖండ్రిక, తాతపూడి, వెదురుమూడి, కపిలేశ్వరపురం గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. దూరపు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహక కమిటీ, దాతలు అన్నదానం నిర్వహించారు.

ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడికి సత్కారం


అంగర పీహెచ్‌సీలో మల్లికార్జునుడిని అభినందిస్తున్న ఉద్యోగులు

కపిలేశ్వరపురం: ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ మండపేట యూనిట్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన కపిలేశ్వరపురానికి చెందిన వైద్య,ఆరోగ్య ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడిని శనివారం సహచర ఉద్యోగులు సత్కరించారు. అంగర పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలు సత్కరించారు. ఉద్యోగుల హక్కుల సాధనకై కృషి చేసిన అనుభవం ఉన్న నాయకుడిగా మల్లికార్జునుడు మరింత చొరవతో పని చేస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు, హెల్త్ విజిటర్ తాతపూడి మేరీమణి, ఎల్‌టీ ఆలీ, సిబ్బంది పాల్గొన్నారు.

కేపీ రోడ్డులో ట్రాఫిక్ మళ్లించాలి

మండపేట: పట్టణంలోని కపిలేశ్వరపురం రోడ్డులో భారీ వాహనాల దారి మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ పోలీసులను కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేపీ రోడ్డు ఎంట్రన్స్ అయిన కలువపువ్వు సెంటర్లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అక్కడే వేంకటేశ్వరస్వామి ఆలయం కూడా ఉండడంతో ప్రతి శనివారం ఉదయం ఈ ఆలయానికి భారీ ఎత్తున వచ్చే భక్తులతో రద్దీగా ఉంటోందన్నారు. అదీగాక హైదరాబాద్ నుంచి కపిలేశ్వరపురం వెళ్లే ప్రైవేట్ బస్సుల ఉదయం పూట ఎక్కువగా ఉంటాయన్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఈ సమస్యపై దృష్టి సారించి శనివారం నాడు ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

చిన్న ట్రాక్టర్ దమ్ముతో మేలు

- రెండో సారి దమ్ము చేయడం ప్రయోజనకరం
- శాస్త్రీయ పద్ధతులు పట్ల అవగాహన అవసరం
- రెండు నియోజకవర్గాల్లో 99,461 ఎకరాల్లో ఖరీఫ్ సాగు


కేవీఎన్ రమేష్‌కుమార్

కపిలేశ్వరపురం: చిరుజల్లులు పడే సమయంలో ఖరీఫ్ సాగుకు అన్నదాతలు సన్నద్ధం అవుతున్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 99,461 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఐదేళ్లుగా గ్రామాల్లో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు చేదోడుగా నిలిచాయి. నీటి యాజమాన్య పద్ధతులను అవలంభిస్తూ సాగుకు ఉపక్రమించాల్సిన సమయం ఆసన్నమైంది. ఆ నేపథ్యంలో సాగులో తొలి ప్రక్రియ అయిన దమ్మును చేసే విషయంలో నూతన పద్ధతులను అవలంభించాలంటూ కపిలేశ్వరపురం మండల వ్యవసాయ శాఖాధికారి కేఎన్‌వీ రమేష్‌కుమార్ చేస్తున్న సూచనలివీ...

తక్కువ లోతు దమ్ముతో ప్రయోజనాలెన్నో...

చేనుకు మందు చల్లేటపుడు రైతు అడుగులు సక్రమంగా పైపైన పడుతుంటాయి. పని సునాయాసంగా తేలిపోతుంది. పైపైన దమ్ములో వరిమూన లోతుగా వెళ్లడం వల్ల మూన త్వరగా వేళ్లు వేసుకుంటుంది. 15 సెంటీమీటర్లు మాత్రమే లోతు ఉండడం వల్ల ఎరువు సక్రమంగా మూనకు చేరుతుంది. వరిమూన త్వరగా దుబ్బుగా మారడం వల్ల ఖర్చు కూడా తగ్గుతుంది.


చిన్న ట్రాక్టర్‌తో వరి చేనులో దమ్ము చేస్తున్న దృశ్యం

లోతైన దమ్ముతో ఇబ్బందులు

సాధారణంగా రైతులు లోతుగా దమ్ము చేయిస్తుంటారు. దీనివల్ల నాట్లు వేసేటపుడు వరిమూన లోతుగా భూమిలోకి దిగుతుంది. మూన పైకి వచ్చేందుకే చాలా రోజుల సమయం పడుతుంది.రైతు పాదాలు లోతుల్లోకి వెళ్లి పైకి రావాల్సి ఉండటంతో అధిక శ్రమ వెచ్చించాల్సి వస్తుంది. శాస్త్రీయ పద్ధతి ప్రకారం 15 సెంటీమీటర్లు దమ్ము సరిపోతుంది.

చిన్న ట్రాక్టరు వినియోగం మేలు

దమ్మును 15 సెంటీమీటర్లు చేస్తే సరిపోతుందనుకున్నపుడు చిన్న ట్రాక్టరుతో దమ్ము చేయించుకోవడం మేలు. పెద్ద ట్రాక్టర్ బరువు అధికంగా ఉండడంతో అడుగులోతు దిగుతుంది. చిన్న ట్రాక్టరుతో సరిగ్గా 15 సెంటీమీటర్ల లోతు పడుతుంది. సంప్రదాయ పద్ధతిని వీడి చిన్న ట్రాక్టర్‌ను వినియోగించేందుకు రైతు ముందుకు రావాలి.

రెండోసారి దమ్ము ప్రయోజనకరం

తొలి దమ్ము పూర్తయిన వారం తర్వాత మరోమారు దమ్ము చేసుకోవడం మంచిది. ఇటీవల రైతులు ఈ పద్ధతిని వీడుతూ ఒకేసారి పూర్తి స్థాయిలో దమ్ము చేయిస్తున్నారు. దీని వల్ల గడ్డి సక్రమంగా కుళ్లదు. వరినాట్లు వేసిన తర్వాత ఆ గడ్డి కుళ్లి గ్యాస్‌గా మారుతుంది. దీంతో దుబ్బు తయారీలో ఇబ్బందులు ఎదురవుతాయి. మొదటి దమ్ములో ఎకరాకు నాలుగు బస్తాల సూపర్ ఎరువు వేయడం వల్ల కాల్షియం, సల్ఫర్ (గంధకం) మూలకాలు అందుతాయి. దీనివల్ల వేర్లు త్వరగా అభివృద్ధి చెందడానికి, గింజ పోసుకునే ప్రక్రియలో నాణ్యత పెరిగేందుకు, తద్వారా తూకంలో బరువు పెరిగేందుకు దోహదం చేస్తుంది.

రెండు నియోజకవర్గాల్లో ఖరీఫ్ సాగు ఇలా...

మండలం	వరిసాగు ఎకరాల్లో	ఆర్బీకేలు
మండపేట	16,191	24
రాయవరం	14,641	19
కపిలేశ్వరపురం	15,762	19
రామచంద్రపురం	18,128	21
కె.గంగవరం	15,656	23
కాజులూరు	19,083	23
మొత్తం	99,461	129

వెదజల్లులో పాటించాల్సిన జాగ్రత్తలు

విత్తనాలు జల్లేందుకు 15 రోజుల ముందే తొలి దమ్ము చేయాలి. విత్తడానికి నాలుగు రోజులకు ముందు మరోసారి దమ్ము చేయాలి. సమానంగా దమ్ము చేసి మట్టి పేరుకున్న తర్వాత ప్రతి రెండు మీటర్లకు 20 సెం.మీ కాల్వలు చేయాలి. మొలక బయటకు రాగానే పొలంలో పలుచటి నీటి పొర ఉంచి సమానంగా వెదజల్లాలి. లేదా డ్రమ్ సీడర్ ద్వారా నీటిని పూర్తిగా తీసివేసి కూడా విత్తవచ్చు. మొక్కలో మొదటి ఆకు విచ్చుకునే వరకూ (7 లేదా 10 రోజులు వరకూ) పంటకు ఆరుతడి అవసరం. వెదజల్లు పద్ధతిలో వరి సాగు వల్ల తక్కువ నీటితో మంచి దిగుబడులు సాధించవచ్చు.

పీఠంలో జ్యేష్ఠ పౌర్ణమి పూజలు


సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శనివారం జ్యేష్ఠ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పీఠం అర్చకుడు శివ కుమార్ అర్చకత్వంలో జ్యేష్ఠ మాసంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, పంచద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. తొలుతగా విజయ వేంకటేశ్వర స్వామి వారికి సుప్రభాత సేవ, తులసిదళ అర్చన, భవానీ శంకర సమేత అష్టమ లింగేశ్వరస్వామి వారికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి లలితా సహస్రనామాలు, లలితా, దుర్గా, సరస్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పీఠానికి వచ్చి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పీఠానికి వచ్చిన భక్తులకు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్‌ల ఆధ్వర్యంలో ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు.

బడిబయటి చిన్నారుల గుర్తింపునకు సర్వే


సమావేశంలో మాట్లాడుతున్న నేను బడికి పోతా జిల్లా నోడల్ అధికారి రమేష్‌బాబు

మండపేట: బడిఈడు చిన్నారులందరూ బడిలోనే ఉండాలని, అది చిన్నారుల హక్కని 'నేను బడికి పోతా' కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి డి.రమేష్‌బాబు, సమగ్ర శిక్షా ఏఎంవో పి.రాంబాబు అన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బడిబయటి చిన్నారులను గుర్తించేందుకు సీఆర్‌ఎంటీలు, పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లతో పట్టణంలోని గౌతమి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం సమావేశం నిర్వహించారు. ఎంఈఓ సీహెచ్‌వీ సోమిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో రమేష్‌బాబు, రాంబాబు మాట్లాడుతూ 6–14 ఏళ్ల వయసున్న ప్రతి చిన్నారీ బడిలోనే ఉండాలన్నారు. బడి బయట చిన్నారులను గుర్తించేందుకు సీఆర్‌ఎంటీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లు జూలై 12లోగా సర్వే నిర్వహించాలన్నారు. బడి ఈడు చిన్నారులందరినీ గుర్తించి, తిరిగి వారిని బడిలోనే చేర్చేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. ఎంఈవో సోమిరెడ్డి మాట్లాడుతూ సర్వేను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. అనంతరం సర్వే నిర్వహించే తీరుతెన్నులను ఆల్టర్నేటివ్ స్కూల్స్ కో–ఆర్డినేటర్ రమేష్‌బాబు వివరించారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు రామభద్రం, పి.శేషారావు, నారాయణరావు, వెంకటలక్ష్మి, ఆఫీస్ సబార్డినేట్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీశ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో క్రిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కొర్లపాటివారిపాలెంలో...

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


నల్లచెరువులో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు.

ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు అవసరం


విద్యుత్ ఉద్యోగులు శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రవీణ్

రామచంద్రపురం: విద్యుత్ ఉద్యోగులు ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు ఎంతో అవసరమని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్ సూచించారు. ఏపీఈపీడీసీఎల్ ఆదేశాల మేరకు ఎనర్జీ అసిస్టెంట్ గ్రేడ్–2 సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం స్థానిక ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో నిర్వహించారు. డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ ఆధ్వర్యంలో జరిగరిన ఈ శిక్షణలో విద్యుత్ శాఖలో రూల్స్, సేఫ్టీ ప్రికాషన్స్, ఎల్‌సీ యాప్ ప్రొసీజర్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ప్రమాదాలకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్ సూచనలు చేశారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు అవసరం అని దురదృష్టవశాత్తు ఒకవేళ ప్రమాదం సంభవిస్తే ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై డాక్టర్ ప్రవీణ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కంచుమర్తి మురళీమోహన్, చొల్లంగి శ్రీధర్, అసిస్టెంట్ ఇంజినీర్లు కె.సాంబశివరావు, మేడిశెట్టి వెంకటరమణ, ఎస్.ఏసురాజు, డి.శ్రీనివాసరావు, జేఏఓలు, ఏడీఎంలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలోని కొడవటివారిలంకకు చెందిన ఓ యువకుడు అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై వి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడిలోని కొడవటివారిలంకకు చెందిన వంత్రపాటి వీరవెంకటసత్యనారాయణ (25) ఈ నెల 20న తనకు పెళ్లికావడం లేదని మనస్తాపంతో పురుగుమందు తాగాడు. అతడిని బంధువుల చికిత్స కోసం అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వీరవెంకట సత్యనారాయణ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి సోదరుడు వీరన్న ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి


గొల్లపాలెంలో సీజనల్ వ్యాధులపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సౌజన్య

కాజులూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీలో నీటి, కీటకజనిత వ్యాధుల నివారణ, నియంత్రణలపై సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చెదురు, మదురు వర్షాల కారణంగా గ్రామాలలో అపారిశుద్యం తలెత్తి డయేరియా, టైఫాయిడ్, మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు సక్రమించే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై సిబ్బంది ప్రజలలో అవగాహన పెంపొందించాలన్నారు. వాటర్ హెడ్ ట్యాంక్ క్లోరినేషన్, నీటి పరీక్షలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ శ్యామ్యూల్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



కె.గంగవరం పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కె.గంగవరం: స్థానిక ఎస్సీ పేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు శనివారం ధర్నా నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ ఉదయం 6 గంటలకు నీళ్లు వదులుతున్నారని, కేవలం అరగంటలోనే నీటి సరఫరా నిలిపి వేయడంతో గ్రామస్తులు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఒకపూట మాత్రమే అదీ కూడా కేవలం అరగంట మాత్రమే నీరు వదులడం సమంజసం కాదని అన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి చంటికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బి.సిద్ధూ, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి, ఏఐకేఎంఎస్ నాయకులు కాశి లెనిన్‌బాబు, కె. అనంత లక్ష్మి, నేతల మాధవరావు, చింతా చంద్రరావు, దివ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి

పి.గన్నవరం: ఆర్‌పీ రోడ్డులో ఊడిమూడి వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతులకు ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని ఊడిమూడి, జి.పెదపూడి గ్రామాలకు చెందిన మృతుల కుటుంబీకులు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అమలాపురంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద డీఆర్‌ఓ మొగలి వెంకటేశ్వరరావుకు వారు వినతిపత్రం సమర్పించారు. గత నెల 14న ఊడిమూడి వద్ద వ్యవసాయ కూలీలు ట్రాక్టర్‌పై ధాన్యం బస్తాలను లోడ్ చేసి, పగ్గాలు కడుతుండగా రావులపాలెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొట్టిన విషయం విదితమే. ప్రమాదంలో ఊడిమూడి, జి.పెదపూడి గ్రామాలకు ఐదుగురు వ్యక్తులు మృతి చెందగా, కొన్ని రోజుల తర్వాత ఆర్టీసీ బస్సు కండెక్టర్ కూడా మరణించిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన రోజు రాత్రి రెండు గ్రామాల ప్రజలు, నాయకులు ఆందోళన చేపట్టడంతో కొత్తపేట ఆర్డీఓ వచ్చి, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ప్రకటించినట్టు వారు వివరించారు. ఎన్నికల కోడ్ కారణంగా ఈ సాయాన్ని ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. తీవ్ర ఇబ్బందులు పడుతున్న తమకు తక్షణమే సాయం అందించి ఆదుకోవాలని మృతుల కుటుంబాలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాయి.

బుడిబడి అడుగులకు వేళాయె


గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

- ఈ నెలాఖరు వరకు 'మన అంగన్‌వాడీ పిలుస్తోంది'
- క్లస్టర్ పరిధిలో 425 కేంద్రాలు

రాయవరం: చిన్నారుల భవితకు అంగన్‌వాడీ కేంద్రాలు బాటలు వేస్తున్నాయి. బుడిబుడి అడుగులు వేసే దశలో పూర్వ ప్రాథమిక విద్యతో తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషకాహారం సైతం అందిస్తున్నారు. పౌష్టికాహార లోపంతో ఇబ్బంది పడుతున్న వారికి అదనపు ఆహారం ఇస్తూ ఆరోగ్యంగా ఎదిగేలా కృషి చేస్తున్నారు. తాజాగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాలు మొదలయ్యాయి. ప్రస్తుతం క్లస్టర్ పరిధిలోని 423 అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

ఆటపాటలతో చదువు

ప్రస్తుతం విద్యార్థులపై పెడుతున్న ఒత్తిడి అంతా ఇంతా కాదు. మార్కులు, ర్యాంకులే లక్ష్యంగా సాగిపోతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య చదువుతున్న చిన్నారులు సైతం నలిగిపోతున్నారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. ఒత్తిడి లేని విద్య అందించడమే లక్ష్యంగా నిర్దేశించారు. చిన్నారుల్లో విషయ పరిజ్ఞానం పెంపొందించే కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఆటలు, పాటలు, కథలతో చిన్నారులకు చదువు నేర్పిస్తున్నారు.

విద్యతో పాటు పౌష్టికాహారం

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు గ్రామీణ ప్రాంతాల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం కూడా అందిస్తున్నారు. రోజూ ఉదయం గుడ్లు, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం చిక్కీలు ఇస్తారు. ఆర్థిక ఇబ్బందులతో పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వలేకపోతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు అంగన్‌వాడీ కేంద్రాలు వరంగా మారాయి. ఆటలు, పాటలు, కథలతో పాటు సంభాషణలు నేర్పిస్తారు. మంచి అలవాట్లు అలవడేలా చొరవ చూపుతారు. పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించేలా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారు.

యూకేజీ వరకూ ఇక్కడే

రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను నర్సరీలో చేర్చుకుంటారు. మూడేళ్ల వయసు దాటే సరికి లోయర్ కిండర్ గార్డెన్ (ఎల్‌కేజీ)కు పంపిస్తారు. నాలుగేళ్లు నిండిన చిన్నారులకు యూకేజీ విద్య నేర్పిస్తారు. ఇలా పూర్వ ప్రాథమిక విద్య పూర్తవుతుంది. రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశం కల్పిస్తారు.

ప్రత్యేకతలు ఇలా

ఆటలు, పాటలు, కథలతో పాటు సంభాషణలు నేర్పిస్తారు. మంచి అలవాట్లు నేర్పిస్తారు. పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారు. యూకేజీ వరకు పూర్వ ప్రాథమిక విద్యను అందించి బడికి సంసిద్ధులను చేస్తారు. నిపుణులు సూచించిన ఆట వస్తువులను ఉపయోగిస్తారు. పిల్లలను నిరంతరం పరిశీలన చేస్తారు. అంగన్‌వాడీలో పూర్వ ప్రాథమిక విద్య అభ్యసిస్తున్న చిన్నారులకు పరీక్షలు నిర్వహించి ప్రగతి పత్రాలు అందజేస్తారు.

క్లస్టర్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు
రాయవరం	70
మండపేట	94
కపిలేశ్వరపురం	78
రామచంద్రపురం	105
కె.గంగవరం	78

క్లస్టర్‌లో ఇదీ పరిస్థితి

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రామచంద్రపురం, మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలు, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాలు ఉన్నాయి. క్లస్టర్ పరిధిలో 419 అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరు మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో ప్రస్తుతం 2,112 మంది గర్భిణులు, 1,806 మంది బాలింతలు ఉన్నారు. అలాగే 1,669 మంది ఆరు నెలల లోపు చిన్నారులు, 8,791 మంది ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు ఉండగా, మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 6,208 మంది ఉన్నారు.

ఇంగ్లిషు విద్య అమలు చేస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడేళ్ల వయస్సు వచ్చిన చిన్నారులను చేర్పించేందుకు కృషి చేస్తున్నాం. ప్రీ ప్రైమరీ–1 నుంచే ఇంగ్లిషు విద్య నేర్పిస్తున్నాం. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడమే కాకుండా, వారికి పౌష్టికాహారాన్ని కూడా అందజేస్తున్నాం. తల్లిదండ్రుల నుంచి ప్రతి స్పందన బాగుంది.

– సీహెచ్ సత్యవతి, అంగన్‌వాడీ కార్యకర్త, రామచంద్రపురం

ఒత్తిడి లేని విద్య



చిన్నారులందరినీ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి. ఇప్పటికే ఈ కేంద్రాల టీచర్లు, ఆయాలు అర్హులైన చిన్నారులను గుర్తించి నమోదు చేస్తున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో 'మన అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం కొనసాగుతోంది. ఒత్తిడి లేని విద్య ఇక్కడే అందుతుంది. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి.

– అధికారి గజలక్ష్మి, పీవో, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, మండపేట

తల్లిదండ్రులు ప్రోత్సహించాలి



అంగన్‌వాడీ కేంద్రాల్లోనే తమ చిన్నారులను చేర్చేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. ఇక్కడ ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ–1, ప్రీ ప్రైమరీ–2 అమలు చేస్తున్నారు. చిన్నారులకు అక్కడే పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఈ నెలాఖరు వరకూ మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం అమలవుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే కూడా నిర్వహిస్తున్నారు.

– వీవీ వరాహలక్ష్మి, పీవో, ఐసీడీఎస్ ప్రాజెక్ట్, రామచంద్రపురం